ప్రజాశక్తి
సోమవారం 21, నవంబర్ 2022 5 అనంతపురం

గుంతకల్లు జట్టుపై తాడిపత్రి టీం గెలుపు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన అండర్ 12 క్రికెట్ పోటీల్లో గుంతకల్లు జట్టుపై తాడిపత్రి జట్టు గెలుపొందింది. ఆర్డీటి,ఏడీసీఏ సంయుక్త ఆధ్వర్యంలో అండర్ 12 జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జరిగిన పోటీలో తాడిపత్రి జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. గుంతకల్లు జట్టు 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసింది. తాడిపత్రి జట్టులోని బౌలర్ అభిరామ్ మూడు వికెట్లు, అఫ్రీన్ తాజ్, ప్రభాస్ ఒక వికెట్ చొప్పున తీశారు. అనంతరం తాడిపత్రి జట్టు బ్యాటింగ్ చేసి రెండు వికెట్ల నష్టానికి 97 పరుగులు తీసి విజయం సాధించింది. తాడిపత్రి జట్టు క్రీడాకారుడు పునీత్ సాయి 55 పురుగులు చేసి విజయాన్ని అందించాడు. తాడిపత్రి జట్టు విజయంలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆర్డీటి ఎటిఎల్ రామాంజనేయులు, క్రికెట్ సీనియర్ కోచ్ సాదిక్‌వలి, ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ అధ్యక్షులు ఎండ్లూరి ప్రభాకర్

మానసిక పరిశుభ్రతతో జీవితానికి శ్రేయస్సు

ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ అధ్యక్షులు ఎండ్లూరి ప్రభాకర్

సెమినార్‌కి హాజరైన విద్యార్థినులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మానసిక పరిశుభ్రత పాటించి మంచి జీవితానికి మార్గం వేసుకోవాలని ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ సౌత్‌జోన్ అధ్యక్షులు డాక్టర్ ఉదయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఐద్వా, ఎస్‌ఎఫ్ఐ, ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ ఆధ్వర్యంలో కెఎస్ఎన్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎండ్లూరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో అతి చిన్న పిల్లల నుంచి ముసలి వయస్సు వారి వరకు అనేక మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని తెలిపారు. శారీరక ఆరోగ్యానికి ఇచ్చే ప్రాధాన్యత మానసిక ఆరోగ్యానికి ఇవ్వకపోవడమే కారణం అన్నారు. టెక్నాలజి అభివృద్ధి చెందిన నేపథ్యంలో మంచి కోసం విజ్ఞానాన్ని వినియోగించడం వల్ల సమాజానికి మంచి జరుగుతుందన్నారు. అలాకాదని చెడు కోసం వినియోగించడంతో వారితో పాటు చుట్టూ ఉన్న సమాజానికి కూడా చెడు తలపించే ప్రమాదం ఉందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, ఆరోగ్యంగా జీవించడం మానసిక పరిశుభ్రత పాటించడంతోనే సాధ్యమవుతుందన్నారు. ఒక సమస్య నుంచి బయట పడటానికి మరొక సమస్యల్లో కూరుకుపోతూ, సమస్యను ఎవరికీ చెప్పుకోలేని నైరాశ్యంలోకి వెళ్లిపోతున్నారని తెలిపారు. దీనివల్ల ఆత్మహత్యలు వంటివి చోటు చేసుకుంటున్నాయన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేదని, సమస్యలు వచ్చినప్పుడు ఒకరినొకరు చెప్పుకునే వారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అసాధారణ పద్ధతులను ఒత్తిడి నియంత్రణకు ఉపయోగించడం వల్ల చిన్న వయస్సులోనే దీర్ఘకాలిక జబ్బులకు గురవుతూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సమాజంలో జరుగుతున్న ఆత్మహత్యలు, డ్రగ్స్ అలవాటు, మొబైల్ గేమ్స్, లోన్‌యాప్స్, చిన్న వయస్సులోనే ప్రేమ వివాహాలు చేసుకోవడం, కుటుంబ కలహాలతో చేసే వృత్తిపై ప్రభావం పడటం, మన శరీరాన్ని యాంత్రికంగా జీవిస్తున్నామన్న విషయాన్ని గమనించకపోవడం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వీటన్నింటిని నియంత్రించేందుకు యాంత్రిక జీవితాన్ని వీడి మానసిక పరిశుభ్రత పాటిస్తూ మంచి జీవితాన్ని గడపాలని సూచించారు. పిల్లలకు సమస్యలు వచ్చినప్పుడు తల్లి తండ్రులకు స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణాన్ని ఇంట్లో పెంపొందించుకోవాలని సూచించారు. ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ సౌత్‌జోన్ అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకుని తల్లి తండ్రుల ఆశయాలను నెరవేర్చుకోవాలన్నారు. కెఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకరయ్య మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై మరిన్ని సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల ఎదుగుదలకు తోడ్పాటు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్, నాయకులు రిషి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఈ-నామ్..బద్నామ్..!

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు, కమిషన్ ఏజెంట్‌లు ఒక్కటయి యార్డుకు వచ్చే రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అరికట్టాల్సిన అధికారులు వారితో కలిసిపోయి పరోక్షంగా సహరిస్తుండడంతో రైతు దగా పడుతున్నాడు. ఇది చాలదన్నట్లు ఈ-నామ్ విధానంలో వ్యాపారాలు జరగాల్సి ఉన్నా బహిరంగ వేలం ద్వారా వాపారం చేస్తున్నారు. ధరను, సరుకును తక్కువ చూపించి ప్రభుత్వానికి తక్కువ కమిషన్‌ను చెల్లిస్తున్నారు. ఈ విషయాలన్నీ తెలిసినా ఏమీ పట్టనట్లు స్థానిక అధికారులు వ్యవహరిస్తుండడం గమనార్హం.

ఒక్కటై రైతులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న మార్కెట్ అధికారులు

బహిరంగ వేలంలో వ్యాపారం ధర, సరుకు తగ్గించి ఈ-నామ్‌లో నమోదు

ప్రజాశక్తి-హిందూపురం

రైతులకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయాలని, వ్యాపారాలను చట్టబద్ధత చేసేందుకు ప్రభుత్వం అనంతపురం, హిందూపురం, కళ్యాణదుర్గం మార్కెట్ యార్డుల్లో ఈ-నామ్ విధానాన్ని అమలుచేసింది. ఈ-నామ్ అమలు జరిగితే తమ ఆటలు సాగవని తెలిసి వ్యాపారులు ధరలను ఆమాంతం తగ్గించి రైతులను రెచ్చగొట్టి కార్యాలయం ఎదుట ఆందోళన చేయిస్తున్నారు. ఆధికారులు సైతం ఈ-నామ్‌కు గండికొట్టడానికి వ్యాపారులకు సహకరిస్తూ మార్కెట్‌లో మాయ చేస్తున్నారు.

మాది రైతు ప్రభుత్వం..రైతుల సంక్షేమమే లక్ష్యం అంటూ స్థానిక వార్డు మెంబర్ నుంచి ముఖ్యమంత్రి వరకు ఉపన్యాసాలు ఊదరగొడుతున్నా.. అధికారులు మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు బాగుంటేనే ముడుపు అందుతాయన్న విధంగా హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు వ్యవహరిస్తున్నారన్నది అక్షర సత్యం. ఈ-నామ్ అమలుకు అన్ని సౌకర్యాలు, సిబ్బంది ఉన్నప్పటికి అమలు చేయడం లేదు. దీనికి వ్యతిరేంగా ఈ-నామ్ సిబ్బంది మాట్లాడితే వారిపైనే అగ్రహం వ్యక్తం చేస్తూ సుపర్‌వైజర్లు అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పై అధికారులు ఈ-నామ్‌ను తప్పని సరిగా అమలుచేయాలని ఒత్తిడి తెస్తే..వ్యాపారులకు చెప్పి ధరలను అమంతంగా తగ్గిస్తున్నారు. ఈ-నామ్‌లో ఆధరలను నమోదు చేస్తారు. రైతులను రెచ్చగొట్టి ఈ-నామ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేయిస్తున్నారు.

రైతులను మాయచేసి మోసం..

ఈ-నామ్ విధానం ద్వారా వ్యాపారులు లావాదేవీలు జరిపితే తప్పనిసరిగా ప్రతిపైసాకు ప్రభుత్వానికి లెక్కచూపించాల్సి ఉంటుంది.

ధర నిర్ణయించి చీటి రాసి ఉంచిన దృశ్యం

బహిరంగ వేలం ద్వారా మిర్చిని కొనుగోలుచేసే వ్యాపారులు 20 నుంచి 30 శాతం లెక్కలు చూపించి మిగిలినది జీరో బిజినెస్‌గా చూపిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 20 కేజీల తూకానికి ఒక కేజీ తూకం అదనంగా తీసుకుంటున్నారు. దీంతో పాటు మార్కెట్ నిబంధనల మేరకు రూ.100లకు 2 శాతం కమీషన్ ఉంటే ఇక్కడ మాత్రం 4 శాతం తీసుకుంటున్నారు. వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు రైతులకు అప్పు ఇచ్చివుంటే ఒక శాతం పెంచి ఐదు శాతం తీసుకుంటున్నారు. మొత్తానికి హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో రైతులను మాయచేసి మోసం చేస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

మార్కెట్ యార్డులో మిర్చికి బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న కమిషన్ ఏజెంట్

అవగాహన కల్పించడంలో విఫలం

ఈ-నామ్ విధానంపై అధికారులు రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే ఈ-నామ్ అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి అవుతున్నా దీనిపై రైతులకు అధికారులు అవగాహన కల్పించలేక పోయారు. దీంతో వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు ఏమి చెపితే దానికి రైతులు ఊకొడుతూ వారికి వారే మోసం చేసుకుంటున్నారు.

సిబ్బంది ఉన్నా అమలుకావడం లేదు..

ఈ-నామ్ అమలుకు హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రత్యేక కంప్యూటర్లతో పాటు సిబ్బంది కూడా ఉన్నారు. వారు విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నా మార్కెట్‌లో పనిచేసే అధికారులు కొందరు అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ-నామ్ పూర్తి స్థాయిలో అమలు జరిగితే మార్కెట్ అధికారులకు వచ్చే మాముళ్లు అందవు. దీంతో ఇది అమలుకాకుండా చూస్తున్నారన్న చర్చనడుస్తోంది.

కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులదే శాసనం..

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో అనాదిగా కొంతమంది మాత్రమే వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్ పొందివున్నారు. వారు చెప్పిందే మార్కెట్‌లో వేదం. ఇక్కడ కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు కలిసి శాసిస్తే దాన్ని అధికారులు తూచా తప్పకుండా పాటించాల్సిందే. దీనికి తోడు గ్రామాలకు వెళ్లి రైతులకు కొంత మొత్తం అడ్వాన్సుగా చెల్లిస్తున్నారు. దీంతో పండించిన సరుకును రైతులు వారివద్దకే తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఈ-నామ్ విధానం వల్ల ధరలు తగ్గిపోతాయని దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేయాలని రైతులను రెచ్చగొడుతున్నట్లు సమాచారం. ప్రత్యక్షంగా, పరోక్షంగా కొందరు అధికారులు సహకరిస్తున్నట్లు ఆశాఖ సిబ్బందే చెబుతున్నారు.

గిట్టుబాటు ధర వస్తే చాలంటున్న రైతులు

'ఈ-నామ్ అయినా, బహిరంగ వేలం అయినా.. ఏ పద్ధతిలో వ్యాపారాలు చేసినా మాకు అభ్యంతరం లేదు. పంటకు గిట్టుబాటు ధర ఇస్తే చాలు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు, ఏజెంట్లు ఒక్కటై మోసం చేస్తున్నారు. ధరలు ఆమాంతం తగ్గాయని, సరుకు అమ్ముడుపోలేదని మభ్యపెడుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదు'.. అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు కరపత్రం అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-కుందుర్పి

సిఎం జగన్ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల ఇళ్లల్లో వెలుగులా మారాడని మంత్రి కె.వి ఉషశ్రీచరణ్ అన్నారు. ఆదివారం మండలంలనోఇ కెంచెంపల్లి, కొలిమిపాలెం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిరన్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధిపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగానే ధైర్యంగా ఇంటింటికీ వెళ్తున్నామనానరు. రానున్న రోజుల్లో కూడా మరోసారి సిఎం జగన్‌కు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాధర్, ఎంపిపి కమలా నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, వైస్ ఎంపిపిలు, సోమనాథ్, శ్రీలక్ష్మి అజయ్‌బాబు, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ కె.పాలాక్షి, సింగిల్‌విండో ఛైర్మన్ ఎఆర్ వన్నూర్‌రెడ్డి, కురుబ సంఘం మండల అధ్యక్షుడు కెపి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకుందాం

రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి బెలుగుప్ప



మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు

రెడ్డి కులస్థలంతా ఐకమత్యంతో పోరాడి మన సమస్యలను పరిష్కరించుకుందామని రెడ్డిసంఘం గౌరవాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బూదిగుమ్మ ఆంజనేయస్వామి వెంకటరమణస్వామి ఆలయ ప్రాణాంగంలో రెడ్డి ఆత్మీయ సంఘం సమావేశం నిర్వహించారు ఇందులో భాగంగా మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు, అనంతరం కార్తీక వనభోజనాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్ల కులస్తుల్లో కూడా ఎంతోమంది నిరుపేదలు ఉన్నారన్నారు. అలాంటి పేదవారికి పిల్లలకు చదువులకు సంఘం తరపున తమ వంతు సహాయము అందించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే బ్రిటిష్ వారిపై మన దేశం కోసం పోరాడి ప్రాణ త్యాగాలు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కసిరెడ్డి వేమారెడ్డి, కుంటి మల్లారెడ్డి, వెంకటరెడ్డి, సర్దార్ వల్లభాయ్‌పటేల్ రెడ్డి, నాయకురాలు నాగమ్మరెడ్డి చేసిన త్యాగాల గురించి కొనియాడారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సునీతారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రెడ్డి కులస్తులు పాల్గొన్నారు.

'ఉన్నత విద్య' ప్రమాణాలు పెంచుతున్నాం

విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధికి కృషి

'ప్రజాశక్తి'తో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఉన్నత విద్యలో అత్యుత్తమమైన ప్రమాణాలను తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.. ఆ దిశగా మార్పులను తీసుకొస్తోంది'.. అని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసరు కె.హేమచంద్రారెడ్డి 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. అనంతపురం జెఎన్‌టియులో జరిగిన ఒక సమావేశంలో పాల్గొనేందుకు ఆయన అనంతపురం విచ్చేసిన సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఉన్నత విద్యలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు, అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

ప్రశ్న : ఉన్నత విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులేమిటీ ?

ఛైర్మన్ : ఉన్నత విద్యాభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. సమూలమైన మార్పులు తీసుకొచ్చే దిశగా అనేక చర్యలు ఇప్పటికే చేపట్టింది. విద్యా విధానంలో గతంలో లాగా చదువు ఒక్కటే కాకుండా ఇంటర్న్‌షిప్ విధానాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా డిగ్రీ చదివే విద్యార్థికి చదువు ఒక్కటే కాకుండా ప్రాక్టికల్‌గా తెలుసుకునే అవకాశాలు కలుగుతాయి. ఇది విద్య పూర్తయిన తరువాత తాము ఏమి చేయాలన్న ఆలోచన ఆ విద్యార్థుల్లో కలుగుతుంది. ప్రతి విద్యార్థి తరగతికి హాజరై ప్రత్యక్షంగా విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో వచ్చే నెల నుంచి ఫేసియల్ రికగ్నైజేషన్ అటెండెన్సును రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతోంది. ఇప్పటి వరకు అక్కడక్కడ విద్యార్థులు తరగతులకు హాజరవకుండానే పరీక్షలు రాసే పరిస్థితులూ ఉన్నాయి. ఈ విధానం ద్వారా కొంతవరకు మెరుగు పడేందుకు అవకాశముంటుంది.

ప్రశ్న : బోధనా ఖాళీలు పెద్దఎత్తున ఉన్నాయి..ఇవి భర్తీ కాకుండా ఉన్నత విద్య పూర్తి స్థాయిలో ఏ రకంగా అందుతుంది ?

ఛైర్మన్ : బోధనా సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. గడిచిన 15 ఏళ్లుగా భర్తీలు పూర్తి స్థాయిలో జరగలేదు. దీంతో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2019 లోనే వీటిని భర్తీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. సుమారు రెండు వేల పోస్టులైనా భర్తీ చేసేందుకు సిద్ధపడింది. అయితే కొంతమంది న్యాయస్థానాలకు వెళ్లడంతో న్యాయపరమైన చిక్కులొచ్చాయి. వాటిని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి భర్తీ చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వముంది. అప్పటి వరకు కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బందిని నియమించుకుని ఇబ్బంది కలుగకుండా చేసే ప్రయత్నం చేస్తున్నాం. కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలను కొంతవరకు పెంచాం.

ప్రశ్న : ప్రయివేటు విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు సరైన విద్యా ప్రమాణాలు పాటించడం లేదు..వీటి కట్టడికి తీసుకుంటున్న చర్యలేమిటీ ?

ఛైర్మన్ : ప్రయివేటు విశ్వవిద్యాలయాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు మానిటర్ చేసే విధంగా ప్రత్యేకంగా మానిటరింగు కమిషన్ వేశాం. ఇక ప్రయివేటు విద్యా సంస్థలు ప్రమాణాలు పాటించడంపై ప్యాక్టు ఫైండింగు కమిటీలను వేయడం జరుగుతోంది. ఇందులో వచ్చిన నివేదికల ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ఆ విధంగా 57 కళాశాలలపై చర్యలు తీసుకున్నాం. సుమారు 340 కోర్సులు ఆయా కళాశాలల్లో వాటిని రద్దు చేశాం. సీట్ల సంఖ్యను ఇది వరకటికంటే 60 వేలు తగ్గించాం. గతంలో 6 లక్షల సీట్లు ఉండేవి. ప్రస్తుతం వాటిని 5.40 లక్షలకు తీసుకొచ్చాం. ప్రధానంగా ఇంటర్మీడియల్ చదువు పూర్తి చేసుకుని ఏడాదికి వస్తున్న వారు 3.50 లక్షలు ఉన్నారు. సీట్లు ఏకంగా 5.40 లక్షలు ఉన్నాయి. ఇంత పెద్ద వ్యత్యాసం ఉండటంతో విద్యార్థులు ఆసక్తి చూపని కళాశాలల్లో సరైన విద్య ఉండటం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు సరిగా లేని, బోధన సరిగాలేని కళాశాలలపై చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : ఏటా ఎన్ని సీట్లు ఖాళీగా ఉంటున్నాయి.. వీటిని సద్వినియోగం చేసుకునే విధంగా దిగువ స్థాయి నుంచి తీసుకుంటున్న చర్యలేమైనా ఉన్నాయా ?

ఛైర్మన్ : అవును దీన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జిఇఆర్) పెరిగింది. బడికి వస్తున్న విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఇది పది, ఇంటర్మీడియట్‌లోనూ కనిపిస్తోంది. ఇది పెరగడం ద్వారా డిగ్రీ చేరే వారి సంఖ్య కూడా పెరగనుంది. వచ్చే రెండు, మూడేళ్లలో డిగ్రీ వరకు చదివే వారి సంఖ్య ఏడు లక్షల వరకు చేరుతుందన్నది ప్రభుత్వ అంచనా.

గుత్తిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గహం

డివిజన్ చేశారు...కోడ్ మరిచారు..

జీతాలు, డైట్ ఛార్జీలు రాక అవస్థలు

అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్న వార్డెన్లు

వసతి గృహాల్లో పరిస్థితి ఇదీ..

ప్రజాశక్తి-గుత్తి

నెలలు గడుస్తున్నా జీతాలు, విద్యార్థుల డైట్‌ఛార్జీలు రాకపోవడంతో గుత్తి డివిజన్ పరిధిలోనిసాంఘిక సంక్షేమ శాఖ వార్డెన్లు, వర్కర్లు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం జిల్లా విభజన అనంతరం ప్రభుత్వం గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, యాడికి, గుంతకల్లు, విడపనకల్లు మండలాలు కలిపి సాంఘిక సంక్షేమ శాఖ గుత్తి డివిజన్ గా ఏర్పాటు చేశారు. అయితే డిడిఓ కోడ్ ఇవ్వడం మరిచారు. దీంతో ఈ ఏడాది మార్చి నెల నుంచి విద్యార్థుల డైట్ ఛార్జీలు, జూలై నెల నుంచి వార్డెన్లు, వర్కర్లు, ఏఎస్ డబ్ల్యూ ఓ కార్యాలయ సిబ్బందికి జీతాలు అందలేదు. అలాగే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు కూడా మంజూరు కాలేదు. వేతనాలు రాక వార్డెన్లు జీవనం దుర్భరంగా మారింది. డివిజన్ పరిధిలో 10 వసతి గృహాలు, ఒక కళాశాల బాలుర వసతిగృహం, 5 బాలుర వసతి గృహాలు, 4 బాలికల వసతి గృహాలు ఉన్నాయి. వాటిల్లో 165 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈనేపథ్యంలో డైట్‌ఛార్జీలు లేకపోవడంతో వార్డెన్లు వడ్డీలకు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. కాస్మోటిక్ ఛార్జీలు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు డైట్, కాస్మోటిక్ ఛార్జీల మంజూరు కోసం పలుమార్లు వార్డెన్లు ఉన్నతాధికారులు చుట్టూ తిరుగుతున్న ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఎన్నాళ్లు తాము ఇలా అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెట్టాలని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెలవులు పెట్టి వెళ్లిపోతామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాత డిడిఓ కోడ్ కింద వెసులుబాటు కల్పించి జీతాలు, డైట్, కాస్పోటిక్ ఛార్జీలు మంజూరు చేయించాలని వార్డెన్లు, వర్కర్లు, కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు కథ సమాప్తం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

చిన్నారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

2019 ఎన్నికల్లోనే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కథ సమాప్తమైందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం నగరంలోని 9వ డివిజన్‌లో కార్పొరేటర్ దేవీతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో భాగంగా సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూనే స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ఎన్ని కుట్రలు చేసినా, డ్రామాలు ఆడినా మరోసారి చంద్రబాబుకు అధికారం దక్కదని స్పష్టం చేశారు. సిఎం జగన్ నాయకత్వంలో మూడేళ్లగా రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. ప్రజలు సంతోషంగా ఉంటే టీడీపీ, ప్రతిపక్ష పార్టీల నాయకులు మాత్రమే ఏడుస్తున్నారన్నారు. కర్నూలు పర్యటనలో చంద్రబాబు వాడిన భాష, చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. కర్నూలులో హైకోర్టు కావాలని అక్కడి ప్రజలు నిరసన తెలిపితే సమాధానం చెప్పుకోలేని చంద్రబాబు.. ఫ్రస్టేషన్‌లో నేను రౌడీని, తరిమికొడతా అంటూ దూషించడం తగదన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమగ్రంగా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. గతంలో చంద్రబాబు, బీజేపీతో పాటు వారికి మద్దతు తెలిపిన జనసేన పార్టీల వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇప్పుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అప్పుడు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 2019లోనే చంద్రబాబుకు చివరి ఎన్నికలు అయిపోయాయని, 2024 ఎన్నికల్లో చంద్రబాబుతో కలిసి వచ్చే పార్టీలకు చివరి ఎన్నికలు అవుతాయని జోస్యం చెప్పారు. ఓటమిని ముందే గ్రహించే అన్ని పార్టీలు ఒకటవుదామని చంద్రబాబు అంటున్నారన్నారు. ఏ ముసుగులో వచ్చినా, ఎంత మంది కలుసుకున్నా వచ్చే ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మెగా వైద్యశిబిరం

వైద్యశిబిరానికి వస్తున్న పిజెఆర్ ట్రస్టు వెల్ఫేర్ ట్రస్టు వ్యవస్థాపకుడు పెరుమాళ్ల

ప్రజాశక్తి-గుంతకల్ రూరల్

మండల పరిధిలోని వైటీ చెరువు గ్రామంలో పిజెఆర్ సోషల్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో అమీలియో ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత మెగావైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిజెఆర్ సోషల్ వెల్ఫేర్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి మాట్లాడుతూ ఈవైద్యశిబిరంలో 400 మందికి పైగా చికిత్స చేసినట్లు తెలిపారు. గుంతకల్లు మండలంలోని నాగసముద్రం, నెలగొండ, వైటి.చెరువు గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి దాదాపు 1500 మందికిపైగా చికిత్స అందించడంతోపాటు ఉచితంగా మందులు ఇచ్చినట్లు తలెఇపారు. అదేవిధంగా ఆపరేషన్లు అవసరమైన వారికి పది లక్షలకు పైగా ఖర్చు చేసి రెండు వందల మందికి కర్నూలులోని అమీలియో ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యం అందక, ఖరీదైన ఆసుపత్రిలో చూపించుకునే స్థోమత లేక రోగులకు ఈ వైద్యశిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ క్యాంపు ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచి లక్ష్మయ్య, రామాంజనేయులు, మృత్యుంజయుడు, పెద్దొడ్డి వెంకటరాముడు, ఖాదర్‌వలీ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జనసేనలో యువతకు ప్రాధాన్యత

జిల్లా అధ్యక్షులు, అర్బన్ ఇన్‌ఛార్జి టిసి వరుణ్

యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేన అధ్యక్షుడు టి.సి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన పార్టీలో యువతకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, అర్బన్ ఇన్‌ఛార్జి టిసి వరుణ్ తెలిపారు. ఆదివారం నగరంలోని స్థానిక 42వ డివిజన్ నుంచి జనసేన నాయకులు నజీమ్, హీద్దూ ఆధ్వర్యంలో పలువురు జనసేనలో చేరారు. వీరికి వరుణ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంతోపాటు, వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అలాగే స్థానికంగా ఉన్న సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులు, యువతకు ఉపాధి అవకాశాలు లేక పడుతున్న కష్టాలపై చర్చించారు. యువతకు ఉజ్వలమైన భవిష్యత్తు కల్పించాలంటే ఎంతో చిత్తశుద్ధి కలిగిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తోనే సాధ్యమవుతుందన్నారు. అలాంటి పవన్‌కళ్యాణ్‌కి యువత బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు జయరాంరెడ్డి, అంకె ఈశ్వరయ్య, ప్రాంతీయ మహిళా కమిటీ సభ్యులు పశువులేటి పద్మావతి, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేశులు, దరాజ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఓ పుస్తకం మంచి స్నేహితునితో సమానం

విప్ కాపు రామచంద్రారెడ్డి - ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఓ మంచి పుస్తకం మంచి స్నేహితునితో సమానమని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన 55వ జాతీయ వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం ఒక దేవాలయం లాంటిదన్నారు. విద్యార్థులు రోజూ పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలన్నారు. దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి గొప్ప వ్యక్తులను మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొత్తపల్లి సత్తి, గుమ్మగట్ట మండల కన్వీనర్ మంజు, విద్యార్థులు, పాఠకులు, పాల్గొన్నారు.

ఉరవకొండ : నవంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించిన 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం స్థానిక గ్రంథాలయంలో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వై.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులతోపాటు నేటి యువత పుస్తకాల పట్ల ఆసక్తి పెంపొందించుకునే విధంగా గ్రంథాలయాలు వాటి ప్రయోజనాలు గురించి చైతన్య పరిచే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. అనంతరం పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన అధికారులు, పాఠకులు, ప్రజలు, పాత్రికేయ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

గుంతకల్లు : పుస్తకాల పఠనంతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవానీ అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. ప్రతిఒక్కరికీ పుస్తకాల పఠనంతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు నాగేశ్వరరావు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కొండారెడ్డి, గ్రంథాలయ అధికారి కమ్మన్న, గ్రంథాలయ సిబ్బంది రికార్డు అసిస్టెంట్ రాము, లైబ్రేరియన్ ఎం.హేమలత, ఉపాధ్యాయులు ప్రభాకర్, నరసింహ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి హెచ్.రామాంజనేయులు అధ్యక్షతన ఆదివారం ముగింపు వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూర్‌బీ మాట్లాడుతూ విద్యార్థులు తరచూ గ్రంథాలయాలను సందర్శించి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయంలో సమస్యలను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రంథాలయంలోని సౌకర్యాల మెరుగునకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం, వకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జన్నే. కుళ్లాయి బాబు, వైసిపి నాయకులు షఫీ,రోఫ్, గ్రంథాలయ సిబ్బంది సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి వేడుకలు

మంత్రి ఉషశ్రీచరణ్‌కు స్వాగతం పలుకుతున్న కురబలు

నార్పల : మండల కురుబ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు పార్టీలకతీతంగా ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు భారీగా తరలివచ్చారు. దీంతో నార్పల కిటకిటలాడింది. ఈ వేడుకలకు మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, రాష్ట్ర కురుబు కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్, కురుబ కార్పొరేషన్ మాజీ అధ్యక్షురాలు సవితమ్మ, అనంతపురం మాజీ మేయర్ రాగే పరశురాం తదితరులు హాజరయ్యారు. వీరికి కురుబల సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక గాంధీ సర్కిల్ నుంచి కనకదాస విగ్రహం వరకూ నడుచుకుంటూ వెళ్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గూగూడు రోడ్డులో సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, సర్పంచులు సుప్రియ, గవ్వల శ్రీరాములు, కురుబ సంఘం నాయకులు రామకృష్ణ, బొందలవాడ రాజు, జానగాని శివశంకర్, రామకృష్ణ, పట్నం ఫణీంద్ర, మల్లెల శివయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వరునికి పూజలు

ఆత్మకూరు : మండలంలోని పంపనూరు సుబ్రమణ్యేశ్వర ఆలయంలో కార్తీకమాసం చివరి ఆదివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతపురం వాస్తవ్యులు సంధ్యామూర్తి శిష్యబందం పరమేశ్వరునికి ప్రతిగా సంప్రదాయ నత్య , గీత, గాన సేవలు చేశారు. పెనుగొండ త్రిపుర రిసార్ట్స్ వారి సహకారంతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సంకల్ప దీక్షను మూడు రోజులపాటు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 27న స్వామివారి మాలధారణ దీక్షా స్వీకారం ఉదయం 6:30 గంటలకు చేపడుతున్నట్లు ఆలయ ఈవో అక్కిరెడ్డి తెలిపారు. 28న స్వామివారికి పల్లకీ సేవ, 29న ఉదయం 9 గంటలకు పాల కావిడి ఉత్సవం 4:30 గంటలకు పంపనూరులో స్వామివారి గ్రామోత్సవం ఉంటుందన్నారు.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO:11/2021

Between:
D.Khasim ...plaintiff
And
Ammineni Srinivasulu ...Defendants
To
Ammineni Srinivasulu S/o Rama Krishnaiah, residing at D.No:3/478-4,Krishnapuram 1st Road, Tadipatri Town, Ananthapur District.

ప్రతి వాదికి నోటీసు

పై కేసులో వాదులుగా ఉంటూ తమ హక్కులు నిర్ధారణకై మీ పైన పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు.కోర్టు వారు సదరు దావాను మీ హాజరు కొరకు 07-12-2022 కి వాయిద వేసి ఉన్నారు. కావున మీ కేసులో మీకు ఏదైన అభ్యంతరాలు ఉన్న యెడల మీరు పై కోర్టులో ఖుద్దున కానీ, వకీలు ద్వారా కానీ హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేని యెడల విషయమును కోర్టువారు మీ పరోక్షములో తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వు మేరకు)

వి.మునయ్య
వాది పరం వకీలు, తాడిపత్రి

In the court of the prl Senior Civil Judge : Ananthapuramu
I.A.No:25/2022 in O.S. No: 607/2017

Between:
Arabu Amarnath ...plaintiff
V/S
Dasari Pullamma & Others ...Defendants

Notice to Defendants No:5&7

To
1.Dasari Pullamma W/o S.Srinivasulu, Aged 45 Years, Hindu, D.No:25-445-4, Parthasarathi Nagar, Dharmavaram Town.
2.Marasu Raghavendramma W/o Marasu Mallesu, Aged 41 Years, Hindu, D.No:14/47, Bukkapatnam Veedhi, Tadipatri Town.

పై నెంబరు దావాలోని ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 01-12-2022 వ తేదిన వాయిదా వేసినారు. కావున ఆ దినం ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా కానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును.అట్లు హాజరు కానీ యెడల పై దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

A.NAGARJUNA REDDY,
Advocate for the plaintiff
Cell:9440874191

In the Court of the Hon'ble Senior Civil Judge:Gooty
E.P.No.44/2019 in O.S. No.261/2018

Between:
Kummara Ramanna S/o Ramanna, R/at D.No.10-417, Vinayaka Nagar, Moragudi Village, Jammalamadugu Mandal, YSR Dist.
...Petitioner/D.Hr
And
Manne Ramachandra Reddy S/o Obula Reddy, Realtor, R/at D.No.6/16, Chikkepalli Village, Yadiki Mandal, Anantapur Dist.
...Respondant/J.Dr

వేలం ప్రకటన

అర్జీదారుడు తన ఇ.పి. మొత్తమును రాబట్టుటకు జె.డిఆర్‌కు చెందిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నాడు. వేలంలో పాల్గొనదలచినవారు 05-12-2022వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు:

Land Situated in the Registration District of Anantapuramu and Sub Registration District of Yadiki in 23/2 Nitturu Village, Yadiki Mandal within the following particulars.
Govt.Dry S.No.346, A.C:1-90 Cents Paiki A.C:1-77 or 0.716 HS.
Bounded by: East:Land of M.Venkatalakshmamma West:Land of Chettemreddy Venkata Subba Reddy, North:Vanka Narava, South:Land of Chettemreddy Venkata Narayana Reddy.
D.Hr Value: Rs.2,12,400/-
Ameena Value Rs.12,00,000/-

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

టి.ధనుంజయ, D.Hr అడ్వకేట్
గుత్తి, సెల్:9885896307.

మహారాజశ్రీ ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.84/2019

Between:
బి.గాదిలింగప్ప. ...వాది
V/s
వి.రాజు. ...ప్రతివాది
టు,
వి.రాజు తండ్రి వి.తిమ్మప్ప
డోర్ నెంబర్ 3/21,
పంది కుంట గ్రామం,
వజ్రకరూర్ మండలం,
అనంతపురం జిల్లా.

సమన్లు

పై దావాలోని వాది, ప్రతివాది అయిన మీపై ప్రాంసరినోట్ అప్పు వసూలు నిమిత్తం పై దావాను దాఖలు చేసియున్నారు. కావున మీరు 29-11-2022 తేది ఉదయం గం॥ 10.30 ని॥లకు ఖుద్దున గాని లేక వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(By Order of the Court)

ఆర్.వి.యుగంధర్,
వాది తరపున న్యాయవాది,
ఆలూరు.

కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం

పట్టించుకోని అధికారులు

ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని మైలాపురం వద్ద విద్యుత్ 11కెవి స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. గ్రామానికి చెందిన ఓరైతు పొలంలో దాదాపు 50 శాతం ఒరిగి ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒరిగిన విద్యుత్ స్తంభం లైన్ కింద పని చేయాలంటే భయం భయంగా ఉందని కూలీలు, రైతులు వాపోతున్నారు. ఒకవేళ ఈ స్తంభం కూలితే జరిగే ప్రమాదం భారీ స్థాయిలోనే ఉంటుందని చెబుతున్నారు. ఈమధ్య కాలంలోనే మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో విద్యుత్ లైన్ తెగి పడి ఐదుగురు కూలీలు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఒరిగిన విద్యుత్ లైన్ వల్ల మరో ప్రమాదం జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు, కూలీలు కోరుతున్నారు.

గర్భిణులకు ఒడిబియ్యం నింపుతున్న నిర్మల మురళి

నిస్సహాయ మహిళలకు 'పుట్టినిల్లు'

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ దంపతులు పురుషోత్తమ మురళీకృష్ణ, నిర్మలమురళి నిస్సహాయ, నిరాదరణ మహిళల కోసం 'పుట్టినిల్లు' ఆశ్రమాన్ని ప్రారంభించారు. ఈమేరకు ఆదివారం ఆదర్శనగర్‌లో నిర్మించిన కొత్త భవనంలో పూజలు నిర్వహించి 9 మంది ముత్తైదులకు ఒడిబియ్యం నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆశ్రమంలో నిస్సహాయ, నిరాదరణ మహిళలతోపాటు, పేద విద్యార్థులు ఆశ్రయం పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే కుటుంబ కలహాల నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న మహిళలు రెండు, మూడు రోజులు వసతి పొందవచ్చన్నారు. అంతేగాకుండా అలాంటి మహిళలకు తగిన సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు త్రిపురక్క, శశికళ, భారతి, కల్పన, చంద్రకళ, గాయత్రి, రంజిత పాల్గొన్నారు.

ఉరవకొండ పంచాయతీకి రూ.కోటి మంజూరు

ఉరవకొండ : 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఉరవకొండ మేజర్ పంచాయతీలోని ఐదు సచివాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు సర్పంచి మీనుగా లలిత తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తానని సిఎం జగన్ నాడు ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వర్‌రెడ్డి చేసిన కృషి వల్లే నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో ఆయా వార్డు సచివాలయం పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో మురుగునీటి కాలువలు, రోడ్లు, మరమ్మతులు, తాగునీటి పథకాలు, పైప్‌లైన్‌లు వంటి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. అలాగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ స్థానిక వార్డు సభ్యులతో సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

కెజిబివిలో బాలల హక్కుల దినోత్సవం

తాడిపత్రి రూరల్ : పెన్నానది ఒడ్డున ఉన్న కెజిబివిలో హ్యాండ్స్-చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో ఆదివారం బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ ధ్యేయంగా అందరూ పని చేయడంతోపాటు జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు మీరు కూడా కృషి చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రభుత్వం బాలిక విద్యను ప్రోత్సహిస్తూ అనేక పథకాలు ఉన్నట్లు తెలిపారు. 0 నుండి 18 సంవత్సరాల వయసు మధ్యగల బాలబాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన వారి హక్కుల భద్రతకు ముప్పు వాటిల్లిన చైల్డ్ లైన్ నెంబర్ 1098కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. వెంటనే అన్ని శాఖల సహకారంతో రక్షణ అందిస్తారని తెలిపారు. అనంతరం హాజరైన ముఖ్య అతిథుల నుంచి బాలల దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ టీమ్ సభ్యుడు లావణ్య, కెజిబివి ఇన్‌ఛార్జి వేణి, తహశీలాద్ర్ మునువేలు, ఎంపిడిఒ రంగారావు, పట్టణ, రూరల్ సిఐలు ఆనందరావు, చిన్నపెద్దయ్య, హాండ్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

మృతిచెందిన కృష్ణారెడ్డి

పుట్లూరు : భూ తగాదాతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని చాలువేమల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చాలువేముల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి (62) పోస్టుమెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో శనివారం రాత్రి ఇంట్లో ఉన్న సెనగ పంటకు వేసే మాత్రలు మింగాడు. గమణించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికీ, అన్నదమ్ముల మధ్య భూ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలోనే మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కృష్ణారెడ్డి పెద్దకూతురు పార్వతి తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేసినట్లు ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

చిరుత దాడి..లేగదూడ, రెండు పొట్టేళ్లు మృతి

కళేబరాలను పరిశీలిస్తున్న అధికారులు

బెలుగుప్ప : చిరుత దాడి చేసిన ఘటనలో ఆవుదూడ, రెండు పొట్టేళ్లు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి బెలుగుప్ప తండాలో చోటుచేసుకుంది. బెలుగుప్ప తండాకు చెందిన రైతు ఉమ్లానాయక్ కల్లందొడ్డిలో ఉన్న ంకుల షెడ్డులో ఆవులు, పొట్టేళ్లు కట్టేశాడు. ఈనేపథ్యంలో శనివారం రాత్రి చిరుత దాడి చేయడంతో ఆవుదూడ, రెండు పొట్టేలు మృతిచెందినట్లు వాపోయాడు. వీటి విలువ దాదాపు రూ.40 వేలు ఉంటుందన్నారు. వెంటనే సమాచారాన్ని అటవీ శాఖ బీట్ అధికారులు, వెటర్నరీ అధికారులకు సమాచారం అందించగా హుటాహుటిన ఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదికలు పంపి నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా చిరుత దాడిలో ఆవుదూడ, రెండు పొట్టేళ్లు మృతిచెందరంతో ఏ సమయంలో ఏంజరుగుతుందో అని స్థానికులు భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

బొలెరో వాహనం బోల్తా..

తాడిపత్రి రూరల్ : మండలంలోని తాడిపత్రి బుగ్గ ప్రధాన రహదారిపై ఆదివారం వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో షాహిరా గాయపడింది. నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామ ఉనంచి దాదాపు 30 మంది బొలెరో క్యాంపర్ వాహనంలో తాడిపత్రిలో జరుగుతున్న వలిమా ఫంక్షన్‌కు బయలుదేరారు. తాడిపత్రి మండలం వెంకటరెడ్డిపల్లి వద్దకు రాగానే డ్రైవర్ ముందువైపు వెళ్తున్న లారీని తగులుతుందేమోనని సడన్ బ్రేకు వేశారు. దీంతో వాహనం అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో షాహిరాకు తీవ్రగాయాలయ్యాయి. ఈమెను చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్టీసీ, డ్రైవర్ కండక్టర్ పై దాడి

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి డిపో నుండి గుత్తికి వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామచంద్ర, కండక్టర్ ఇంతియాజ్‌పై వెంకటాంపల్లికి చెందిన ఇద్దరు ఆదివారం దాడి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్టీసీ బస్సు తాడిపత్రి డిపో నుంచి ఆదివారం సాయంత్రం గుత్తికి బయలుదేరింది తాడిపత్రి మండలంలోని వెంకటాంపల్లి బస్టాప్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు డ్రైవర్ బస్సును ఆపాడు. అదే సమయంలో అక్కడే ఉన్న గ్రామానికి చెందిన ఉపేంద్ర అలియాస్ ఉప్పి, లడ్డూ కలిసి బస్సులోకి ఎక్కి డ్రైవర్‌పై దాడి చేశారు. కండక్టర్‌ను కిందికి తోసేసారు. డ్రైవర్, కండక్టర్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శాంతిభద్రతల విషయంలో రాజీలేదు : సిఐ శేఖర్



మాట్లాడుతున్న సిఐ శేఖర్

బెలుగుప్ప : మండలంలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సిఐ శేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఎస్ఐ రామకృష్ణకు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ శేఖర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తీర్చేందుకు పోలీస్ సిబ్బంది ముందుండాలన్నారు. అలాగే పోలీసులు సమన్వయం చేసుకుని నేరాలు తీవ్రం కాకుండా మొగ్గ దశలోనే అణచివేయలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామదాసు, పోలీస్ సిబ్బంది బాలనరసింహులు, రవినాయక్, నాగరాజు, మల్లప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

22న కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

నేడు జిల్లాస్థాయి ఖోఖో జట్ల ఎంపిక

ఉరవకొండ : మండలంలోని ఆమిద్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం జిల్లాస్థాయిలో అండర్-17, 14 బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్.ఎం జి.వి నాగమంజుల, పీడీ మారుతీప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఐపిఇ భానుమూర్తి ఆదేశాల మేరకు పోటీలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మ్మడి అనంత జిల్లాలోని మొత్తం 14అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పాఠశాలల నుంచి 750 మంది క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

22న నాయీబ్రాహ్మణుల సమావేశం

అనంతపురం : నగరంలోని జీసెస్‌నగర్‌లో ఉన్న జయమనెమ్మ కల్యాణ మండపంలో ఈనెల 22వ తేదీన నిర్వహించనున్న నాయీ బ్రహ్మణుల సమావేశానికి భారీగా తరలిరావాలని నాయీ బ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం ప్రతి సేవింగ్ సెలూన్‌కు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి మనకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందాలంటే ఈసమావేశానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణుల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

22 వరకు సున్నా వడ్డీ పథకంపై ఫిర్యాదులు స్వీకరణ

అనంతపురం : వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకం కింద అర్హులైన రైతుల పేర్లు నమోదు లేకుంటే ఈనెల 22వతేదీలోపు జిల్లాలోని ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ఫిర్యాదు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020కి సంబంధించి వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం కింద జిల్లాలో 6613 రైతుల పేర్లు నమోదైనట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హత కలిగిన రైతులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అయ్యప్ప దీక్షాపరుల ఖర్చులను ప్రభుత్వమే భరించాలి

అనంతపురం : అయ్యప్ప స్వామి దీక్షాపరుల ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురుబ నారాయణ స్వామి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముస్లింలకు ఇఫ్తార్ విందు, మక్కా వెళ్లి వచ్చేందుకు అయ్యే ఖర్చులు, క్రిస్మస్ వేడుకలకు ప్రభుత్వ ఎలా నిధులు విడుదల చేసోందో.. అదే రీతిలో శబరిమల అయ్యప్ప మాల ధరించి వెళ్లే భక్తులకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.